# 42. ఆస్థి పంజరం

ఆయాసం ఎక్కువై ఏ పొజిషన్‌లోనూ కూర్చోలేకపోతున్నాడు నీలాచలం. ఎలాగో కష్టం మీద పరుపుచుట్టమీద చేతులు వేసుకొని నిలదొక్కుకున్నాడు. డాక్టరు గారు చెప్పిన డోసుకి రెట్టింపు మింగినా నిద్ర అనేది దరిదాపులకు రావడం లేదు. మంచం పక్క నేల మీద కూర్చుని అయ్యగారి బాధ ఎలా తగ్గించడమో అర్థం కాని సుదర్శన్ సాహూకు నిద్ర రావడం లేదు.

జీవితంలోని ఎలాంటి చికాకయినా చిరునవ్వుతో ఎదుర్కోవాలంటారు. నీలాచలానికి అదేం నప్పడం లేదు. ఆత్మహత్య అనేది పిరికితనమంటారుగాని, దానికీ ఎంతో మనోధైర్యం కావాలనిపిస్తోం దతనికి. ఊపిరి అందక గిలగిల కొట్టుకుంటున్న రోగికి బతుకు మీద పట్టు సడలిపోవడంలో ఆశ్చర్యమేముంటుంది! అందులో ఆనాటి డాక్టరుగారి తీర్పు చెవిన పడ్డాక ఇంకా ఇంకా ఈ జీవితం మీద భ్రమ దేనికి?

"చూడండి రాజారాంగారూ, కన్నకొడుకులు పట్టించుకోక పోయినా ఇటు మీరూ, అటు ఆ సాహూ ఈ బాబుగార్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. మొన్నటి ఎక్స్‌రే చూశానుగా, వాల్వ్స్ బొత్తిగా దెబ్బతిన్నాయి. ఆయనకి చిన్న కునుకు పట్టినట్టుంది. ఇలా దగ్గరగా రండి, నీలాచలంగారి పరిస్థితి ఏమాత్రం బాగులేదు. మహా అయితే ఇంకో మూడు నెలలు. డాక్టరుగా చెప్పడం నా ధర్మం. ఎంత చేసినా మీరిద్దరూ పైవాళ్ళు. అనవసరంగా మాట పడిపోతారు వాళ్ళ అబ్బాయిల్ని వెంటనే పిలిపించండి."

"మహా అయితే మూడు నెలలు" అనే ముక్క చెవిలో పడీపడగానే నీలాచలానికి చెప్పలేని భయం నిలువెల్లా పాకి, ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. అది మామూలు స్థితికి రావడానికి రెండ్రోజులు పట్టింది. జీవుడు ఎంత కొట్టుకుంటున్నా మెదడు అనేది నెమరువేత మానదు కదా. నీలాచలం పెద్ద కొడుకు వెంకట్రమణకి డిఫెన్స్‌లో ఉద్యోగం. చండీగఢ్‌లో ఉంటున్నాడు. మొదట్నుంచి మిలట్రీ బుద్ధి అతన్ది. తల్లి పోయినప్పుడొచ్చి ఏం ఉన్నాడో అంతే.

తండ్రి గురించి అతనికి ఎలాంటి ఆదుర్దా లేదు.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే తండ్రికి ఏం లోటని!

ప్రావిడెంట్ ఫండ్ డబ్బులతో అన్ని సదుపాయాలు ఉన్న సింగిల్ బెడ్ రూమ్ అపార్టుమెంట్ కొనుక్కున్నాడు.

మంచికీ చెడుకీ రాజారాం అంకుల్ ఉన్నాడు.

అప్పుడెప్పుడో, ఎక్కడో బరంపురం నుంచి - వాడు ఇంతున్నప్పుడే తెచ్చుకుని ఇంట్లో ఉంచుకున్న సాహూగాడు తండ్రిని కంటికి రెప్పలా చూసుకుంటూనే ఉన్నాడు. ఇవన్నీ కాక నెలనెలా వచ్చే వెయ్యి రూపాయల పెన్షన్ సదుపాయం ఉంది. దేనికైనా అవసరమని తండ్రి బ్యాంక్‌లో వేసుకున్న

పాతికవేల కేష్ ఉంది. 'ఎంతమంది ముసిలాళ్ళకి ఈ మాత్రం సుఖం ఉంది గనుక!' అనుకున్నాడు వెంకట్రమణ. అనుకోవడమేమిటి, రిటర్న్ ఫ్లయిట్‌కి సిద్ధపడిపోవడమేమిటి, అతనిదంతా బులెట్ స్పీడు. ఇక చిన్నాడు గోపీది అన్నగారికి భిన్నమైన మనస్తత్వం. పవరున్న వ్యక్తిని ఫాలో అవుతూ ఉండడమే వాడి పాలసీ. తల్లి బతికున్నన్నాళ్ళూ ఆవిడ మాటే వేదవాక్యంగా చూసుకునేవాడు. 'నాకు ఆడపిల్లల్లేరనే చింత లేదు. వీడికి నేనంటే ఎంత అభిమానమో' అనే నిండు మనసుతోనే ఆమె వెళ్ళిపోయింది. ఆ తర్వాత తండ్రిని కూడా కొన్నేళ్ళపాటు అంత ప్రాణప్రదంగానూ చూసుకున్నాడు. ఇక పెళ్ళయాక ఆడపిల్లకైతే ఇంటి పేరు ఒకటే మారుతుంది గాని, మగపిల్లాడిలో పూర్తి తేడా ఏర్పడుతుంది కదా! అర్థం, ప్రాణం - అర్ధాంగి అయిన ప్రాణసఖికి ధారాదత్తం చెయ్యడంలోనే గోపీకి ఔచిత్యం కనిపించింది. విడిచి ఉంటే కలదు సుఖం అనే సతీ సూక్తిలో ఎంతో సబువు ధ్వనించింది. 'మరో ఊరికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుంటాను. ఇక్కడే ఉండి మనం వేరే ఉంటే బాగుండదు' అనే మాట కూడా అతను పెళ్ళాం ముందు అనలేకపోయాడు. అలాంటిదేదో మొగుడి మనసులో ఉందని ఆ మొహం చూస్తూనే పసికట్టిన అతని భార్యామణి, 'ఊళ్ళో ఉంటే అప్పుడప్పుడు ఆయన ఆరోగ్య స్థితిని గమనించి వస్తూ ఉండొచ్చు' అని పైకి అందిగాని ఆ సాహూగాడో ఎవరో వాడే ఈపాటికి అన్నీ స్వాహా చేసి ఉంటాడు. 'కనిపెట్టి ఉండకపోతే ఎలా?' అనేది ఆవిడ ఆంతర్యం.

ఇలాంటివన్నీ తలపుకు వచ్చేయి నీలాచలానికి.

"మహా అయితే ఇంకో మూడు నెలలు" అనే వాక్యం మరోసారి మార్మోగింది అతని మనసులో. ఇక అతని ఆలోచనలన్నీ ఓసారి కాలుపెడితే మరి తిరిగిరాని ఆ లోకం వైపే మళ్ళేయి. ఇన్ని మతాలు, ఇన్ని కులాలు - వచ్చేటప్పుడే కాదు, వెళ్ళేటప్పుడు కూడా ఎవరి పద్ధతి వాళ్ళదే. ఎవరి సాగనంపు సంస్కృతి వాళ్ళదే. ఎంత సూక్ష్మ శరీరాలైతే మాత్రం ఆ లోకం ఎంతగా కిటకిటలాడిపోతూ ఉంటుందో? వీళ్ళందరి మధ్యా తన రుక్మిణి ఏ రూపంలో ఎక్కడ ఉంటుందో? మూణ్ణెల్లలోపు అని డాక్టరుగారు శలవిచ్చారు గానీ, అది ఇవాళో, రేపో అయినా ఆశ్చర్యం దేనికి? ఒళ్ళంతా చెమట పట్టి లేచి కూర్చున్నాడు నీలాచలం. సాహూని లేపి మాత్ర వేసుకుని ఓ పావు గంట కిందా మీదా పడితేగాని ఊపిరి అందలేదు.

దేనికైనా పెద్ద కొడుకే విధాయకుడని సాహూకి తెలుసు. 'అయ్యగారూ! పెదబాబుగార్ని పిలిపిద్దామండి' అనే సూచన చేశాడు కూడా. వెంకట్రమణ గనుక ఇంటికొస్తే గుండెకి ఈ మాత్రం కుదురూ లభించదని తనకి తెలుసు కానీ, ఏం చెయ్యడం? శాస్త్రం ఏం చెబుతోంది? పుస్తె కట్టించుకున్న భాగ్యానికి మొగుడి చేత తన్నుల శాస్తి తప్పనట్లు, జన్మనిచ్చిన నేరానికి పెద్ద కొడుకు చేత చచ్చాక కొరివి పెట్టించుకోవడం తప్పదని హిందూ మతం ఘోషిస్తోంది. తానేం తిన్నాడో, లేదో పెద్దవాడు కనుక్కుని పదిహేనేళ్ళు దాటుతుంది. కొరివి పెట్టి, పై టికెట్టిచ్చేశాక ఏడాదికింత పిండం పెట్టే హక్కు మాత్రం వాడిదేనుట. టెలిగ్రామ్ ఇస్తే అందినట్లు, మనియార్డర్ పంపితే పుచ్చుకున్నట్లు, ఆ ఊర్ధ్వలోకాల్లో

ఊగిసలాడుతున్న ఆత్మారాముడు ఆవురావురని ఎదురు చూస్తాట్ట. నమ్మక ఏ గంగలో కలవాలి! అన్నట్లు ఆ గంగని భూమ్మీదకు తేవడానికి కారణం కూడా భగీరధుడు. తలకిందులుగా అల్లల్లాడుతున్న పెద్దలకిన్ని నీళ్ళు వదలి వాళ్ళ ఆత్మలు పావనం చేసి, పితృఋణం తీర్చుకోవడానికేనుట!

ఏడాది క్రితం తల్లి పోయినపుడు వెంకట్రమణ చేతుల మీదనే అన్ని అపర కర్మలూ జరిగేయి. పిల్లల్ని అక్కడ వదిలేసి వాళ్ళిద్దరే వచ్చారు. శాస్త్రంలో తనకి తెలిసినవే కాక కొత్త సూత్రాలు కూడా ఎక్కడికక్కడ జోడించగలడు అతగాడు. "అత్తగారి పుస్తెలు మనమ్మాయికి ఉంచేస్తానండీ" అని పెళ్ళాం అంటే, తాటి ప్రమాణాన లేచాడు ఆవిడ మీద. "నీకేమైనా బుద్ధుందా? ఒక్క పుస్తెలే తీసుకుంటాననటా వేమిటి? తల్లి పునిస్త్రీగా వెళ్ళిపోతే ఆమె ఒంటి మీద బంగారమంతా పెద్ద కొడుక్కే దక్కుతుంది తమ్ముడికి కావలిస్తే వెండి అంతా ఇచ్చేద్దాం" అంటూ లా పాయింట్ లేవదీసి ఏకపక్షనిర్ణయం చేసేసుకున్నాడు. అన్నిటికంటే చిత్రమేమిటంటే, తల్లి లేని తండ్రి బతుకు ఏమౌతుందో ఆ ఇద్దర్లో ఏ ఒక్కరూ మాటవరసకైనా పట్టించుకోలేదు. 'ఆర్థికపరమైన ఇబ్బందులు లేనప్పుడు ఇంకేం కావాలేం?' అని తేల్చేశాడు. 'సాహూగాడు ఉన్నాడుగా అలాంటి విశ్వాసపాత్రుడు అందరికీ దొరుకుతాడా ఏం' అని సరిపెట్టేసుకున్నాడు.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే వాళ్ళ మాటనూ కొట్టిపారెయ్యలేం దేనికైనా ఎవరి మీదా ఆధారపడని ఆర్థిక పరిపుష్ఠి నీలాచలానిది. ఇక సుదర్శన్ సాహూది ఉక్కు శరీరమే కాక, వెన్నపూస మనసు కూడా. ఎక్కడో ఒరిస్సా కుగ్రామం నుంచి బరంపురం వచ్చి అదృష్టవశాత్తూ వీళ్ళ కుటుంబంలో పడ్డాడు. చాకిరీ చేయించుకుంటే చేయించుకున్నారుగానీ ఇంట్లో మనిషిలా చూసుకుంటారు. అమ్మగారు బతికున్నప్పుడు ఒక్క వంటింట్లోకి రానిచ్చేది కాదుగానీ, అంతకుమించి అన్నీ కనుక్కుని ఎంతో ప్రేమతో చూసుకునేది. ఇప్పుడా వంటిల్లు చూస్తే - అందులో అమ్మ లేకపోవడం గమనించి బావురు మంటుంది వాడి మనసు. తప్పనిసరిగా అందులో అడుగుపెట్టవలసి వచ్చి మొదట్లో మరీ కంగారు పడిపోయాడు. ఇక అయ్యగారా, ఆయన దేవుడు ఆ మాత్రం తేడా కూడా పాటించరు. డాక్టరుగారు ఆ ముక్క చెప్పిందగ్గర్నుంచీ అల్లకల్లోలమైపోయింది వాడి మనసు. తాను ఏమైపోతానో అనే చింత వాడికెప్పుడూ లేదు. అయ్యగార్ని బతికించుకునే అవకాశం ఇంకా ఉందేమో! పెదబాబూ, చినబాబూ వచ్చి ఏ హైదరాబాదయినా తీసుకెళ్ళి, ఏ పెద్దాపరేషనో చేయిస్తే బతుకుతారేమో! ఈ మధ్య మరీ గుక్కెడు నీళ్ళు దిగడం లేదు. ఇంతెత్తున గుండె ఎగిరెగిరి పడుతోంది.

నీలాచలానికి పెద్దగా దగ్గరి బంధువులంటూ ఎవరూ లేరు. మొదట్నుంచీ అతన్ది తనలో తానే ముడుచుకుపోయే తత్త్వం. కానీ, బాటిలప్ చేసిన ఎమోషన్స్ బిరడా తీసి పైకి వెళ్ళగక్కుకోకపోతే బాటిల్ ఆ క్షణమే పటేల్ మంటుందేమోనని, ఏకైక స్నేహితుడు రాజారాంని మరోసారి పిలిపించి బయటపడిపోయాడు, "ఇక్కడే ఈ నాలుగు రోజులూ ఉండిపోరా బాబూ" అంటూ.

తప్పనిసరై అతన్ని పిలిపించాడుగానీ, రాజారాంది బొత్తిగా నాస్తికవాదం. దాన్తోపాటు

సోషలిజం కూడా మిళాయించి మాట్లాడుతాడతను. ఇంతకీ అతన్ని పిలిపించిన కారణం ఇదీ:

వారం రోజుల కింద వెంక[టమణకి ఉత్తరాం రాశాడు నీలాచలం. "పెదబాబూ, ఇక నేను అట్టే రోజులు బతకనని ఇవాళ డాక్టరుగారు స్పష్టంగా చెప్పేశారు. మీ అమ్మ పోయినప్పుడు నువ్వే అన్నీ పూనుకుని నీ బాధ్యత నిర్వర్తించావు. శలవు పెట్టి వెంటనే రావలసింది. నన్ను కడతేర్చే బాధ్యత కూడా నీదే కదా!"

తలగడా కింద దాచిపెట్టిన తన ఉత్తరం కాపీ రాజారాం చేతిలో పెట్టేడు. నీలాచలం చేతిలో వణుకుని దాచుకుంటూ "ఇదిగో వాడి జవాబు, ఇవాళ పొద్దున్నే వచ్చింది" అంటూ మరో కాగితం కూడా రాజారాంకి అందించాడు మరింతగా ఆయాసపడుతూ.

"నాన్నా, నీ ఒంట్లో ఇంకా ఆరోగ్యం చేకూరనందుకు మేమంతా చాలా విచారిస్తున్నాం. నాలుగు కేకలేసి, నలుగుర్లో నిలదీసి, ఊళ్ళో ఉన్న తమ్ముడి కుటుంబాన్ని ఇంటికెందుకు తెచ్చుకోవో తెలీదు. ఎద్దులా ఉన్నాడు, వాణ్ణింకా ముద్దు చేస్తావేం?

ఏదో రాశానుగాని తెలిసా? పెద్దవాడిగా నా ధర్మం నేను మరచిపోకూడదు కదా, అలా చేస్తే పుట్టగతులుండవు కదా. ఉన్న మాట రాస్తాను. ఏమీ అనుకోకు. కిందటిసారి మీ కోడలితో పాటు నేనూ వచ్చాను కదా అమ్మ కర్మలకి. నేను చేస్తున్నది సైన్యంలో కవాతు లాంటి ఉద్యోగంగాని, తమ్ముడి బాపతు చచ్చు వ్యాపారం కాదే. అంతా లాస్ ఆఫ్ పే అయిపోయింది. అప్పటికప్పుడు సొమ్ము లేక రెండ్రూపాయల వడ్డీకి అప్పు చేసి వచ్చాం. ఇంత దూరం నుంచి రానూ పోనూ ఖర్చులూ, ఏడాదికయితేనేం పెరిగిపోయిన వడ్డీ అన్నీ కలిపి పదిహేను వేలు దాటుతోంది. తండ్రి రుణం తీర్చుకు తీరాలంటుంది మన సంప్రదాయం రైటే. కొడుకు చేసిన రుణం ఎవరుతీర్చాలట? నేనా ఊర్నుంచి వచ్చే ముందే వెరిఫై చేశాను బ్యాంక్‌లో నీ పేర వడ్డీతో సహా ముప్ఫై వేల దాకా ఉంది. అది పూర్తిగా విత్‌డ్రా చేసి నీ కోడలి పేర వెంటనే డిమాండ్ డ్రాఫ్ట్ పంపు. అది అందీ అందగానే నేను బయల్దేరతాను. నమస్కారములతో, నీ పెదబాబు. తాజా కలం: మీ కోడలి ఒంట్లో నలతగా ఉంటోంది రాలేనని క్షమాపణలు చెప్పమంది. నాదంతా మాటంటే మాటేనని నీకు తెలుసు. ఇలా రాసానని అనుకోకు. డీడీ అందితేనే నేను ఫ్లయిట్ ఎక్కేది సరేనా? పెదబాబు!"

ఇంచుమించు కళ్ళనీళ్ళ పర్యంతమై నీలాచలం రాజారాం రెండు చేతులూ పట్టుకున్నాడు. "ఎవరమైనా వెళ్ళిపోయేవాళ్ళమే. మనమూ ఓ తల్లికీ, తండ్రికీ పుట్టిన వాళ్ళమే. మన కాలంలో ఇలా చేశామా? తండ్రిని తగలెయ్యడానికి కొడుక్కి ఫీజు చెల్లించాలా? ఇదెక్కడైనా ఉందా?"

"నీలాచలం, అట్టే ఆవేశపడకు ఏదో కాదనలేక కర్మకాండ పూర్తిచేసి 'మా నాన్న నాకేమిచ్చాడు ఈ గుండు తప్ప' అనే కాలం ఇది చాలామంది పేరెంట్స్ వాళ్ళు బతికుండగానే సమస్త ఆస్తిపాస్తులూ పిల్లల పేర రాసేస్తున్నారు. డబ్బు చేతికి వచ్చాక కన్న వాళ్ళని మెడబట్టి గెంటేసే పుత్రరత్నాలూ ఉన్నారు. అలాంటి దురవస్థకి లోనవకుండా చివరిదాకా డబ్బు కళ్ళెం చేత్తో పట్టుకున్నావు. ఆ మేరకు సంతోషించు"

అని మొదలెట్టిన రాజారాం క్రమక్రమంగా నీలాచలం బుర్రలోకి హేతువాదం ఎక్కించాడు.

"శరీరం ఉన్నప్పుడు దానికి సంబంధించిన కష్ట సుఖాలు ఎన్నెన్నో అనుభవించావు. పోయింతర్వాత కూడా ఆ కట్టెకు సంబంధించిన కట్టుదిట్టాల గురించి ఎందుకింకా తాపత్రయం? ఆడదానికి తాళి అనీ, చచ్చిన తండ్రికి కొరివి అనీ ఈ రెండూ ఎప్పుడైతే పోతాయో అప్పుడు గానీ ఈ దిక్కుమాలిన దేశం బాగుపడదు. స్వార్జితంతో కట్టుకున్న ఇల్లుంది. పెన్షనుంది. బ్యాంక్‌లో అంతో ఇంతో రెడీ క్యాష్ ఉంది. హాయిగా కన్ను ముయ్యక, చచ్చాక పెట్టించుకునే నిప్పు కోసం ఇప్పుడు మూర్ఖత్వం దేనికి? నేను చుట్టలు కాలుస్తానని నీకు తెలుసు. చుట్టలు అయిపోయాయో, కాల్చుకోడానికి ఒకటైనా మిగిలిందో లేదో, నోట్లు చుట్ట పెట్టుకుంటే ఇదిగో నాన్నా అగ్గి పెట్టి, నేను వెలిగిస్తానుండు' అనే కొడుకుంటే చాలుగానీ చచ్చేక యథావిధిగా నెత్తిమీద ఇంత నిప్పుపెడతాడో లేదో అని బతికుండగానే చచ్చిపోవడం దేనికి? బీ ప్రాక్టికల్ బ్రదర్!"

"అయితే మన మతం, పరంపర ఏం కావాలి!".

"మతాన్ని ఖతం చెయ్యాలి. పరంపరని పరపరా కొయ్యాలి".

రాజారాం వైపు నీలాచలం నిశ్చేష్టుడై చూశాడు. స్నేహితుడి ధోరణి అతను ఎరగంది కాదుగానీ, ఇంతగా మనసు నాటేలా ఇంత కఠినంగా రాజారాం ఇదివరకు మాటాడింది లేదు. డాక్టర్ తీర్పుతోనే వెగటు ఏర్పడింది ఇప్పుడా వెగటు విరక్తిగా మారుతోంది.

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటావ్?"

"మీ గోపీగాడిక్కూడా ఛాన్సిచ్చి చూడు నువ్వనుకున్న ఛాన్సు మాత్రం కాదు" అంటూ ఆ మార్గమేదో విశదపరిచాడు రాజారాం.

ఈ సంపాదనా, దాన్ని మనం గతించాక ఎవరెవరికి చెందేలా రాయాలి అనే ఆవేదనా, బతుకంటే ఇంతేనా? ఈ స్వార్థం చాలక, తనకి ఎవరు కొరివి పెట్టి శ్రద్ధగా కర్మ నిర్వర్తిస్తారో వారికి మరింత ఎక్కువగా ముట్టచెప్పడం, ఇంతేనా జీవితం? బతికుండగా ఎలాగా చేయలేం. చచ్చాకైనా ఈ శరీరానికి కల్పించే ప్రయోజనాల గురించి లేదా ఆలోచన? కళ్ళు లేని కబోదులు ఎందరో లబోదిబోమంటున్నారు. వారికి నేత్ర దానం చెయ్యలేమా? మూత్రపిండాలు పనిచెయ్యక ఎందరో ప్రాణాపాయ స్థితిలో గిలగిల కొట్టుకుంటున్నారు. అతి ఖరీదైన కిడ్నీని అమర్చుకోలేక హతాశులవుతున్నారు. మూత్రపిండదానం కంటే మనకి ఏడాదికో 'పిండం' దొరికేలా చేసుకునే మరణానంతర ఏర్పాటు ఏ విధంగా గొప్పది? ఎనాటమీ డిపార్టమెంట్‌కి రాసివ్వడం కంటె ఏ మృతశరీరానికైనా సార్థక్యం ఉంటుందా?

ఇలాంటి ప్రశ్నలకి మొదట్లో చెవులు మూసుకున్నాడు నీలాచలం. ఇక చెప్పొద్దని రాజారాంని ఇంటి నుంచి తరిమేశాడు. కానీ, క్రమక్రమంగా ఆ భావాలలోని బలం అతన్ని జయించింది చూసి చూసి ఓ మంచి పని ఎలాగా చెయ్యనివ్వదు స్వార్థం. కళ్ళు పూర్తిగా మూసుకుపోయాకైనా కల్పించవద్దా

దీనికో పరమార్థం! ఆ అర్థరాత్రి వేళ సాహూని పంపి రాజారాంని పిలిపించే దాకా అతను ఆగలేకపోయాడు.

"క్షమించరా రాజా నిన్నవసరంగా అడ్డమైన మాటలూ అని వెళ్ళగొట్టేను. నేనెలాగా అట్టే కాలం ఉండను. ఆ పెద్ద వెధవకి అప్పచెప్పేబదులు...."

"అదే కదా నేను చెప్పాలనుకున్నది. ఇందాక నేను గోపీకి ఓ ఛాన్సిచ్చి చూడమన్నది ఇందుకే. వాణ్ణే పిలిపించి నేను చెప్పిన ఏర్పాట్లకి ఒప్పించు. ఇందులో కష్టమేం లేదు కదా".

"అలా కాదు ఇలాంటివి నోటితో చెప్పడం కష్టం నువ్వే రేప్పొద్దున్న వాళ్ళింటికి వెళ్ళి వాణ్ణి కన్విన్స్ చెయ్యి. నా కింకెవరూ లేరు. ఈ స్నేహ ఋణం తీర్చుకునే భారం నీదే" అంటూ రాజారాం రెండు చేతులూ పట్టుకున్నాడు నీలాచలం.

ఆ మర్నాడు మధ్యాహ్నం గోపీ మామగారు ముకుందశర్మగారు ఒక్కరు మాత్రమే వచ్చి నీలాచలాన్ని కలుసుకున్నారు. "ఇదేం బావులేదు బావగారూ" అనే ఇంట్రడక్షన్‌తో పెద్ద గొంతుకతో అరగంట సేపు లెక్చరిచ్చేశారు.

"ఇలాంటి తెగతెంపు, బరితెగింపు ఆలోచనలు ఈ అవసాన దశలో మీకేమంటూ కలిగేయి? ఈ సనాతన ధర్మం ఈనాడు మీరూ, నేనూ పెట్టిందా? దీన్ని కాదనడానికి మనమెవరం? మన ఋషులూ, స్మృతులూ ఏమైపోవాలి? వంశం దుంపనాశనం చేస్తే కలిగే దుర్గతులు ఎలాంటివో ఆలోచించారా?" అంటూ తగులుకుని గట్టిగా అంతులేకుండా ఆపకుండా మాటాడిన అలసట వల్ల గొంతుక బొంగురుపోయి, ఒళ్లంతా చెమటపట్టి, గొంతుకు పలచబడి, ఆఖరికి మెత్తపడి, అతి నెమ్మదిగా అటూ ఇటూ చూస్తూ ఇలా అన్నారు.

"గోపీకి వాళ్ళమ్మగారంటే ప్రాణం. ఇక మీరంటే సరేసరి. దైవంతో సమానం. మరణశయ్య మీద ఉన్నారు మీరు. మీ మాట ఏదైనా ఎలాంటిదైనా వేదవాక్యం. అందుకే ఇటు చెప్పలేక, అటు మింగలేక కళ్ళనీళ్ళ పర్యంతమవుతున్నాడు. ఎలా చెప్పాలో తెలీక కొట్టుమిట్టాడుతున్నాడు" అని శక్తి కొలదీ గుడ్లు మిటకరించి మరోసారి పిలక సవరించుకుని శర్మగారు అల్లుడి ఆంతర్యం వివరించారు. తల్లిది తులమెత్తు బంగారమైనా తలుచుకుని దాచుకోనివ్వకుండా ఆ పెద్దవాడికెప్పుడైతో ఇచ్చేశారో ఆనాడే గోపీ మనసు రాయి అయిపోయిందిట. భవబంధాలు తెంపేసుకున్నాట్ట. 'తండ్రిని రక్షించు దేవుడా' అని వెయ్యి దేవుళ్ళకు మొక్కుతాడుట గానీ, ఎవరెన్ని చెప్పినా గుమ్మం కదలడట. నవనీతంలాంటి ఆ మనసు వజ్ర సమానమై కూర్చుందిట ప్రస్తుతం. తండ్రి భౌతిక శరీరాన్ని ఆస్పత్రికి అప్పచెప్పే దారుణమైన బాధ్యత నిర్వర్తించాలంటే, ఆ కఠినశిల కరగాలంటే తక్కువ మూల్యం చెల్లించాలా మరి!"

"ఇంతెందుకు బావగారూ, ఆఖరిమాట చెప్పేస్తాను వినండి. కావలిస్తే ఆ పింఛను మీరు ఉంచుకుని ఈ ఇల్లూ, బ్యాంక్‌లో సొమ్మూ గోపీ పేర రాసెయ్యండి. మీ కోరిక తీర్చకపోతే నన్నడగండి"

అని ఇటు తిరిగి చరచరా వెళ్ళిపోతూ, గుమ్మం దగ్గర నిలబడి అన్నీ వింటున్న రాజారాంని చూసి తెల్లబోయాడు. అయినా, ఆగలేదు.

ఈ రెండో దెబ్బకి తట్టుకోవడానికి నీలాచలానికి మరీ కష్టమైపోయింది. ఆ అనుభవంతో కలిగిన ఆవేశం హార్ట్ ఎటాక్‌గా మారింది. వెంటనే వైద్యం జరిగి ఉండకపోతే ఆ బలహీన ప్రాణం ఆ క్షణమే ఎగిరిపోయి ఉండును. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఆ తర్వాతి రోజు మధ్యాహ్నం మూడు గంటలకిగాని నీలాచలానికి పూర్తిగా తెలివి రాలేదు. కళ్ళు తెరవగానే ఆయన కంటపడింది సుదర్శన సాహూ స్వరూపం. ఏనుగు లాంటివాడు ఒక్క రోజులో పీనుగులా అయిపోయాడు. వాడి కళ్ళల్లో ఎంత ప్రేమ! అయ్యగారు ఏమైపోతారో అని ఎంత బెంగ ఎంత దీనంగా తయారైంది ఆ మొహం! దగ్గరగా రమ్మని సంజ్ఞ చేసి వాడి బుగ్గలు పుణికాడు. ఆ స్పర్శకి వాడి రెండు కళ్ళల్లో గంగాజలాలు ప్రవహించాయి. వాణ్ణి దెబ్బలాడి ఏదో తిని రమ్మని డబ్బులిచ్చి పంపించాడు.

అక్కడ కుర్చీలో కూర్చుని అన్నీ చూస్తున్న రాజారాం, వాణ్ణి వెళ్ళనిచ్చి అన్నాడు "ఇక అట్టే ఆలస్యం చెయ్యకూడదు. స్నేహితుడిగా నీ ఋణం ఎలా తీర్చుకోవాలో ఆఖరి క్షణంలోనైనా నాకు గుర్తు చేసిన దేవుడికి ధన్యవాదాలు. నీ వీలునామా టైపు చేయించాను చదువుతాను, వినపడుతోందా?"

"చదవొద్దు. ఆపదలో ఆదుకున్నావు నువ్వింకోలా ఎందుకు రాస్తావు! విషయాలేమిటో క్లుప్తంగా చెప్పు. సంతకం చేసేస్తాను. సంతృప్తిగా వెళ్లిపోతాను" అన్నాడు నీలాచలం హీనస్వరంతో.

"ఎంత సేపూ చావబోయే నీ గురించీ, బతికున్న నీ కొడుకుల గురించీ నువ్వే కాదు నేనూ - ఆలోచించాం. నిన్ను నమ్ముకుని ఓ జీవిత కాలం పాటు నీకు సేవ చేసిన ఆ సుదర్శన్ సాహూగాడు ఎదురుగుండా కనపడుతున్నా కళ్ళు మూసుకుపోయాయి మనకి. వాడికి శరీరమే తప్ప బుర్రలేదు. బుద్ధి లేదు, అక్షర జ్ఞానం లేదు. ప్రేమే తప్ప ప్రపంచమార్గం ఎరగడు. నువ్వు పోయాక వాడేం కావాలి?"

" నా ఆస్తి అంతా వాడి పేర రాసేశావు కదూ?"

" అదే నేను చేసింది. ఎన్నిస్తే వాడి ఋణం తీరేను! ఈ ఇల్లూ, మిగిలిన ఆస్తి ఏదుంటే అదీ, అన్నీ వాడికే. అన్నీ నీ స్వార్జితమే కదా! ఇదిగో ఇక్కడ... ఇక్కడ సంతకం చెయ్యి." నీలాచలం ఆ కాగితాల మీద సంతకం చేసేశాడు. తాను పోయాక శరీరం ఏమైపోతుందో, ఏం చేసుకునే ఏర్పాటు చేసుకోవాలో అనే ఆలోచనే లేదతనికి ఆ క్షణంలో. ఏదో తెలియని తృప్తితో, ఆనందంతో అలల్లాగ పరవశించిందతని శరీరం. అంతటి పరవశానికి తట్టుకోలేక హఠాత్తుగా కట్టెగా బిగుసుకుపోయింది.

ఆ మూడోనాడు రైలుపెట్టెలో ఇంత మొహం చేసుకుని కూర్చున్న సుదర్శన సాహూని సాగనంపడానికి రైలు స్టేషన్‌కి వచ్చాడు రాజారాం.

"నీకు చేతనైనంతగా చేశావ్. అలా వెర్రి మొహం పెట్టుకు కూర్చుంటే పోయిన అయ్యగారు తిరిగొస్తారా సాహూ. ఇదిగో ఈ రేకుపెట్టెలో నాలుగు జతల బట్టలున్నాయి. బరంపురానికి టికెట్టిదిగో, జాగ్రత్త పెట్టు. తాళంచెవి ఇదిగో. పెట్టె అడుగున అయిదొందల నోట్లున్నాయి. ఖర్చు పెట్టుకో. వెళ్ళగానే

ఉత్తరం రాయించు ఎవరి చేతనైనా. నా అడ్రస్ రాసిన ఇన్లెండు అందులో పెట్టేను. రైలు కదులుతోంది చూడు. కన్నీళ్ళు తుడుచుకో. అయ్యగారు లేకపోయినా నేనున్నాను" అంటూ రైలు కనుమరుగయే దాకా నడిచాడు రాజారాం.

'అయ్యగారు లేకపోయినా నేనున్నాను' అనే మాటకి అర్థం తెలిసే అవకాశం ఆ అమాయకుడికి లేదు. సుదర్శన్ సాహూకి బదులు తన పేరు రాసుకుని నీలాచలం ఆస్తంతా రాజారాం దఖలు పుచ్చుకుని స్నేహరుణం 'ఆవిధంగా' తీర్చుకున్నాడని ఎవరు మాత్రం ఎరుగుదురు!

★